ప్రజాశక్తి
మంగళవారం 30 సెప్టెంబర్ 2025 5
శ్రీ సత్యసాయి

పెళ్లింట విషాదం

ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర పట్టణానికి పెళ్లి కోసం కర్నాటక ప్రాంతం హాసన్ నుండి వచ్చిన ఇద్దరు యువకులు సరదాగా బంధువులతో కలిసి పట్టణ సమీపంలోని అక్కంపల్లి వద్ద గల స్విమ్మింగ్ పూల్‌కు ఈతకు వెళ్లి నీటమునిగి మృతిచెందిన ఘటన సోమవారం కోసం వెళ్లి నీటమునిగి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ... కర్నాటక రాష్ట్రం హాసన్ జిల్లాకు చెందిన బాబాజాన్(35), మున్వర్(23) అనే ఇద్దరు యువకులు పట్టణంలోని మారుతి నగర్ లో బంధువుల పెళ్లికి ఆదివారం వచ్చారు. పెళ్లి అనంతరం ఈతకోసం అక్కంపల్లి సమీపంలోని స్విమ్మింగ్ పూల్ వద్దకు బంధువులతో కలసి వెళ్లారు. స్విమ్మింగ్ పూల్ లో ఈత కొడుతూ నీటి లోపలికి వెళ్ళినవారు ఎంతసేపు అయినా పైకి రాకపోవడంతో బంధువులు ఆందోళన చెంది అందులో దిగి మునిగిపోయిన ఇద్దరు యువకులను బయటకు తీసుకువచ్చారు. హుటా హుటిన మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ యువకులు మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. ఇద్దరు వ్యక్తులకు ఈత వస్తుందని బంధువులు చెబుతుండగా వారు స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతిచెందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబందించి నిజానిజాలు పోలీసులు దర్యాప్తులో తెలియాల్సుంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నగేష్ తెలిపారు.

మృతిచెందిన యువకులు

పనిగంటల పెంపుతో

పెరగనున్న శ్రమదోపిడీ

గార్మెంట్స్ పరిశ్రమల విధులు నిర్వహిస్తున్న కార్మికులు

ఓ పక్క పని ఒత్తిడి....మరో పక్క శ్రమ దోపిడీ

అనారోగ్యాలకు దారితీసే పరిణామం

పోరాటాలకు సిద్ధమవుతున్న కార్మిక వర్గం

ప్రజాశక్తి-హిందూపురం

శ్రామిక వర్గాన్ని దోపిడీ చేసేందుకు కూటమి ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టానికి అనుగుణంగా చంద్రబాబు కార్మికులకు పని గంటలను పెంచేలా అసెంబ్లీలో నిర్ణయం తీసుకోవడం శోచనీయమని కార్మిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. పని గంటల పెంపుతో కార్మికులపై ఒత్తిడి పెరిగే అవకాశాలు ఉన్నాయి. పని గంటలు పెరగడంతో నిరుద్యోగులకు ఉపాది దొరక్క నిరుద్యోగం పెరిగే అవకాశాలు సైతం ఉన్నాయి. ప్రాణాలను సైతం త్యాగం చేసి సాధించుకున్న హక్కుల రక్షణ కోసం, ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధమవుతోంది. పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాగా ఉన్న అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో 8 పారిశ్రామికవాడలు ఉన్నాయి. 1979లోనే అనంతపురంలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పుడే ఇక్కడ పారిశ్రామికడను నెలకొల్పారు. అయితే 1985లో ఎన్టీఆర్ హయంలో హిందూపురం రూరల్ మండలంలో ప్రత్యేక పారిశ్రామిక వాడను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం పారిశ్రామిక వాడలో 120 చిన్న, మధ్య భారీ తరహా పరిశ్రమలు ఉన్నాయి. దీంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 850 వరకు చిన్న, పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో సుమారు 30 వేల మంది పారిశ్రామిక కార్మికులు పని చేస్తున్నారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా 20కి పైగా గార్మెంట్స్ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో దాదాపు 16వేల మందికి పైగా మహిళా కార్మికులు పని చేస్తున్నారు. అలాగే పెనుకొండ వద్ద ఉన్న కియా కార్ల పరిశ్రమలో సుమారు 5వేల మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. పనిగంటల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వీరందరిపైనా ప్రత్యక్షంగా పడుతుంది. భవన నిర్మాణ రంగ కార్మికులు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, రవాణా రంగ కార్మికులు అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. వీరంతా సుమారు 3 లక్షల మంది దాకా ఉన్నారు. వీరందరిపైనా పని గంటల పెంపు భారం పరోక్షంగా పడుతుంది. అనేక మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని చంద్రబాబు 13 గంటలకు పెంచడంతో ఆయా సంస్థల యాజమాన్యాలు శ్రమదోపిడీ చేసే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వ నిర్ణయం వలన అదనపు పని గంటలు పనిచేస్తే అదనంగా ఒనగూరే ప్రయోజనం కార్మికులకు ఏమీ ఉండదు. వేతనాలు పెరగవు. ఇప్పటికే అరకొర వేతనాలతో రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేస్తున్న కార్మిక వర్గం ఇక నుంచి 13 గంటలు గనుక పని చేస్తే మానసిక ఒత్తిడికి లోనై తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఇదే అదునుగా యజమాన్యాలు కార్మికులతో గొడ్డు చాకిరీ చేయించే అవకాశం ఉంది. ఇప్పటికే 8 గంటల పని దినాలకు బదులుగా అనేక చోట్ల, పలు పారిశ్రామిక సంస్థల్లో 10 గంటలకు పైనే కార్మికులతో పనులు చేయించుకుంటున్న పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వమే పని గంటలను పెంచుతూ అధికారికంగా నిర్ణయం తీసుకోవడం వలన యాజమాన్యాలు కార్మికుల శ్రమను మరింతగా దోచుకునే అవకాశం ఉంది.

మోడీ ప్రసన్నం కోసమే ... ప్రధాని నరేంద్ర మోడీని ప్రసన్నం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికుల శ్రమను దోపిడి చేసి పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్నారు. మోడీని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్న చంద్రబాబు కార్మిక వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. పని గంటల పెంపు వలన అనేక మంది నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది. దీని ప్రభావం వలన ప్రతి ముగ్గురిలో ఒకరు ఉద్యోగం కోల్పోతారు. ఇప్పటికే నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయిలో ఉంది. ఉద్యోగ అవకాశాలు కల్పించక పోగా ప్రభుత్వం అనేక మందిని ఇటీవల కాలంలో తొలగించింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ సమస్య మరింత జఠిలమవుతుంది. ఆకలి మంటతో నిరుద్యోగ యువత ప్రభుత్వంపై తిరగబడే అవకాశాలు ఉంటాయి. రాబోయే రోజుల్లో ఉపాధి అసాధ్యంగా మారుతుంది. ఆర్థిక, సామాజిక సంక్షోభానికి దారితీస్తుంది. పనిగంటల పెంపుతో కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. అధిక సమయం పని చేయడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బర్న్ అవుట్, డిప్రెషన్, ఆందోళనకు కారణమవుతాయనే అభిప్రాయాలను మానసిక వైద్య నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

శ్రమ దోపిడీకి బలం చేకూర్చారు

పరిశ్రమల నిర్వాహకులు ఇప్పటికే కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా అరకొర వేతనాలు ఇస్తున్నారు. కార్మికులను బానిసలకన్నా హీనంగా చూస్తూ వారితో ఇప్పటికే 12 గంటలు పని చేయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టంతో శ్రమ దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉంది. వెంటనే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో కార్మికులందరిని కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

ఈఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా అధ్యక్షులు

వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తాం

కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచుతూ చేసిన తీర్మానాన్ని తక్షణం రద్దు చేయాలి. మహిళలతో రాత్రి వేళలో పని చేయించడం మానుకోవాలి. ఏ రంగంలో పనిచేసే కార్మికుని కైనా కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి. హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోలాపురం పారిశ్రామికవాడలో ఉన్న స్టీల్ పరిశ్రమల్లో ఇప్పటికే కార్మికులతో 12 గంటలు పని చేయిస్తూ శ్రమను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే కార్మిక వర్గంతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతాం.

రవికుమార్,
తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు

మానవ సంబంధాలను కోల్పోతారు

కార్మిక హక్కులను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఇంటి పని చేస్తూ, కుటుంబ పోషణ కోసం బయట పనిచేసే పరిస్థితుల్లో అదనపు పనిభారాన్ని మహిళా కార్మికులపై వేసే విధంగా తీర్మానం చేయడం దుర్మార్గం. ఇది అమలైతే మహిళలు కుటుంబంతో గడిపే సమయం, మానవ సంబంధాలను కోల్పోయే పరిస్థితి దాపురిస్తుంది. ఔ

సావిత్రమ్మ,
ఐద్వా రాష్ట్ర నాయకురాలు

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ శ్యాం ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సమస్యల పరిష్కారంలో అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌ఛార్జి డిఆర్ఒ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 246 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తిచెందే విధంగా నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కరించాలన్నారు.

సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తున్న అర్జీదారులు

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గోడ పత్రిక విడుదల : సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కరపత్రాలను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆవిష్కరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై సంబంధిత అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారి సమత, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ను కలిసి ఎమ్మెల్యేలు : కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శ్యాం ప్రసాద్ ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ ఛాంబర్ లో ఆయనను కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

అంగన్వాడీ సెంటర్లు ఏర్పాటు చేయాలి :సిపిఎం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని 6వ వార్డు కందికుంట నారాయణమ్మ కాలనీ, న్యూఅమీన్ నగర్, బాబా కాలనీ, శ్రీరామ్ నగర్‌లో అంగన్వాడీ సెంటర్లు ఏర్పాటుచేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఆయా కాలనీవాసులతో కలసి సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహాశీల్దార్ మురళీకృష్ణకుకు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయా కాలనీల్లో పిల్లలు అధికంగా ఉన్నారని వారిసౌకర్యార్థ అంగన్వాడీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా కాలనీల్లో పెరిగిన జనాభా దృష్ట్యా రేషన్‌షాపులు ఏర్పాటుచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం అమీన్ నగర్ శాఖ కార్యదర్శి బత్తల సాంబశివ, పట్టణ కమిటీ సభ్యులు రామ్మోహన్, బాబ్జాన్, శాఖ సభ్యులు నారాయణ, కాలనీవాసులు తులసి, బ్రాహ్మణి, సాయమ్మ, నారాయణమ్మ, నాగేశ్వర, రమణయ్య, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు అమ్మజాన్, యాస్మిన్, దివాకర్ నాయక్, మోహన్ నాయక్, ప్రీతి, చందన తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే ధ్యేయం : ఎమ్మెల్యే

అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిని రాష్ట్రంలోని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ పలువురు అధికారులు పాల్గొన్నారు. బాబా జయంతి వేడుకల సందర్భంగా పట్టణంలో రూ. 12 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సత్యసాయి జయంతి వేడుకలకు తరలివచ్చే బాబా భక్తులకు ఇటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులలో భాగంగా ప్రశాంతి నిలయం పడమటి గేట్ నుంచి వడ్డీ వంక వరకు రూ.1.40 లక్షలతో రహదారుల పనికి భూమి పూజ చేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి నాలుగు లైన్ల రోడ్డు మరమ్మతు పనులకు భూమి పూజ చేశారు. అలాగే తహాశీల్దార్ కార్యాలయం నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వరకు రూ.1.70 కోట్లతో రోడ్ల మరమ్మతులు, బ్రాహ్మణపల్లి రోడ్డుకు రూ.1.67 కోట్లతో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. తాగునీటి సమస్య నివారణకై రూ. 4 లక్షల రూపాయలతో నూతన బోర్లను ప్రారంభించారు. వీధిలైట్లు సమస్య తలెత్తకుండా రూ.3.33 లక్షలతో అలాగే చిత్రావతి వంతెన నుంచి సాయి నగర్ వరకు భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు రూ. 8 లక్షలతో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, మాజీ ఛైర్మన్లు బెస్త చలపతి, పీసీ గంగన్న, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కౌన్సిలర్ రత్నప్ప చౌదరి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, డీఈ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధి ఆగదు : మంత్రి సవిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ, అభివృద్ధి ఆపేది లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. పెనుకొండలోని తహాశీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుత జిల్లాలో 6,309 రేషన్ కార్డులు పంపిణీ చేయగా, నియోజక వర్గంలో 949 మందికి అందజేశామన్నారు. తమ ప్రభుత్వ లక్ష్యం అభివృద్ధేనని, ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు సైతం అమలు చేస్తున్నామని తెలిపారు. జగన్ రెడ్డి ఎన్ని అడ్డంకులు సృష్టించినా మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ఎంతో మేలు కలుగుతోందన్నారు.

అక్టోబర్ 4న 'ఆటో డ్రైవర్ సేవలో'.. ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా భరోసా కల్పించాలన్న లక్ష్యంతో అక్టోబర్ 4వ తేదీన ఆటో డ్రైవర్ సేవలో పథకం అమలు చేస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు అందజేస్తామన్నారు. ఆరోజు మధ్యాహ్నం పెనుకొండలో ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

అన్నిరంగాల్లో వైసిపి విఫలం : గత వైసిపి ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని మంత్రి సవిత విమర్శించారు. ఆ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యాలయాలకు రంగులు, సరిహద్దు రాళ్లపై బొమ్మలు వేసుకోవడం, ప్యాలెస్ లు కట్టుకోడానికి ఉన్న డబ్బులు మెడికల్ కాలేజీలను కట్టడానికి లేవా..అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లను బెదిరించినా, విషం కక్కినా పీపీపీ మోడల్ ద్వారా 10 మెడికల్ కాలేజీలు నిర్మించి తీరుతామని స్పష్టంచేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, కమిషనర్ సతీష్ కుమార్, తహాశీల్దార్ స్వాతి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

పరిగి : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని బీసీ సంక్షేమ చేనేత టెక్స్టైల్స్ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం పరిగి మండలంలోని ఊటకూరు లో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ 1.94 కోట్లతో నూతన ఆసుపత్రి భవన నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు పనిగట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు లేదంటూ గాలి మాటలు మాట్లాడి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్వరూప రెడ్డి, రూబీ, సురేష్, నవీన, టిడిపి మండల కన్వీనర్ ఎస్ ఎన్ గోవింద్ రెడ్డి,మండల అభివృద్ధి కమిటీ సభ్యులు సూర్యనారాయణ, బాలాజీ, సోమప్ప, వెంకటేష్, సంజు, సంజీవరాయప్ప, తిలక్, మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వరా..?

కౌన్సిల్‌మీట్‌లో సభ్యుల ఆగ్రహం

సమావేశాన్ని బహిష్కరించిన వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి హిందూపురం

సచివాలయాల్లోకి వెళితే కౌన్సిలర్లను పురుగుల్లా చూస్తున్నారని, సిబ్బంది తమను పట్టించుకోవడంలేదని, తెలుగుదేశం నాయకులను తీసుకొని వార్డుల్లో పర్యటిస్తూ.. ఇంటింటా ప్రచారానికి వెళ్తున్నారని ఇది న్యాయమా అని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తో పాటు వైసిపి కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అజెండాను ప్రారంభించకుండా చైర్మన్ మాట్లాడుతుండటంతో వైసిపి కౌన్సిలర్ రోషన్‌వలి అడ్డుతగిలారు.. దీంతో అధికారులు రూపొందించిన 16 అంశాల అజెండాపై చర్చ ప్రారంభమైంది. సచివాలయాల అంశంపై మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామి రెడ్డి, జబీవుల్లా, కౌన్సిల్ ప్రతిపక్ష నేత ఆసిఫ్ వైసిపి కౌన్సిలర్లు మాట్లాడుతూ సచివాలయాలు నిర్వీర్యం చేశారని, అక్కడ ఎవరూ పని చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ అడ్మిన్లు ఇతర సిబ్బంది తమ వార్డుల్లో టిడిపి ఇన్‌ఛార్జులు,కార్యకర్తలతో కలిసి వార్డుల పర్యటన చేస్తున్నారని. సమస్యలు చెప్పడానికి వెళ్ళినా ఎవరు పట్టించుకోవడం లేదని మునిసిపల్ కమిషనర్ ఏమైనా ఇలాంటి ఉత్తర్వులు ఇచ్చారా అని నిలదీశారు. మునిసిపల్ కార్యాలయ నిర్మాణానికి కన్సల్టెంట్లకు అరకోటి ఇవ్వడాన్ని తాము అంగీకరించమని ఈ అంశంపై తాము అభ్యంతరం తెలుపుతున్నామని డీసెంట్ పత్రాన్ని చైర్మన్ కు, కమిషనర్ కు అందజేశారు. నిబంధనలు పాటించాలని సూచించారు. వార్డుల్లో తమ పట్ల సచివాలయ సిబ్బంది చూపుతున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాజ్యాంగ వ్యతిరేకంగా ఓడిపోయిన వారితో వార్డు పర్యటనలు చేస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ, గెలుపొందిన ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని కోరుతూ తాము కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు వైసిపి సభ్యులు ప్రకటించి సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ప్రజా సమస్యలపై చర్చలు జరిపారు. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు మహిళా కౌన్సిలర్లు తమ సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామి రెడ్డి, జబీవుల్లా, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో పాటు కౌన్సిలర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో వైసిపి టిడిపి సభ్యుల మధ్య వాగ్వాద దృశ్యం

వాడీవేడిగా కదిరి మున్సిపల్ మీట్

ఆక్రమణలపై 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనంపై చర్చ

ప్రజాశక్తి - కదిరి టౌన్

స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్‌ఉన్నీసా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలపై అధికారులను, పాలకవర్గాన్ని నిలదీశారు. కదిరి పట్టణంలో జీ ప్లస్, ఫోర్ జి ప్లస్ ఫైవ్ భవనాలు అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని వీటికి అంతటికి టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమాలకు పాల్పడడం వల్లే ఈ తతంగం అంత జరుగుతుందని విమర్శించారు. ఈ అక్రమాలపై సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావిస్తూ ఇవి అధికారులకు కనబడలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్‌లో అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో ఏ వీధిలోకి వెళ్లినా కుక్కల బెడద ఎక్కువైందని వాటిని నివారించడంలో అధికారులు చర్యలు తీసుకోలేకపోతున్నారని విమర్శించారు. సమావేశంలో అజెండాలో కనపరిచిన వాటిని ఆమోదించిన ప్రతి విషయాన్ని కూడా మినిట్ పుస్తకములో నమోదు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో వీధి దీపాలు సక్రమంగా పనిచేయలేదని అధికారుల దృష్టికి తెలిపారు. మున్సిపాలిటీ గదులకు బినామీలను తొలగించి నిజాయితీలుగా వ్యాపారులు చేసుకుంటున్న వారి వద్దనుండి దశలవారీగా బాడుగలు వసూలు చేస్తే 60 లక్షల రూపాయల వరకు మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. ఆ విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలు సమస్యలపై సమావేశంలో చర్చజరిగింది. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్

ఎంపిడిఒకు వినతి ఇస్తున్న వ్యకాసం నాయకులు, సిపిఎం కాలనీ వాసులు

కనీస సదుపాయాలు కల్పించాలి

ఎంపిడిఒకు సిపిఎం కాలనీవాసుల వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పాలసముద్రం గ్రామ క్రాస్ వద్ద ఏర్పాటైన సిపిఎం కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వ్యకాసం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కమలాబాయికి వినతిపత్రం ఇచ్చారు. వ్యకాసం జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత మాట్లాడుతూ పాలసముద్రం క్రాస్‌లోని సిపిఎం కాలనీలో సుమారు 150 నిరుపేద కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకొని ఐదేళ్లుగా జీవనం సాగిస్తున్నారన్నారు. కాలనీలో అందరూ దళితులు, మైనార్టీలు, బీసీ వర్గాలకు చెందిన రోజువారీ కూలీ పనులు చేసుకొని వారున్నారు. కాలనీ లో నేటికీ తాగునీరు, విద్యుత్, రోడ్లు, తదితర కనీస సదుపాయాలు లేవన్నారు. పేదలు ప్రతి రోజూ డబ్బులు పెట్టి నీళ్ల కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. సరైన విద్యుత్ సౌకర్యం లేక రాత్రి వేళ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా విషయాలపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేకపోతే ఎంపిడిఒ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న, ఇళ్ల స్థలాల సాధన కమిటీ నాయకులు అంజలి, ఆంజనేయులు, ముత్యాలప్ప, బడిగ వెంకటరాముడు, లోకేష్, ప్రదీప్, మణి, ప్యారీమా, లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ, రామాంజనమ్మ, వెంకటమ్మ, రామచంద్రప్ప, తోపెల్లి రామాంజనేయులు, మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ఓబులదేవరచెరువు

మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు నాయకులు వి.వి.రమణ, మండల కన్వీనర్ కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ కార్యదర్శి పద్మావతికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ క్లాప్ మిత్ర కార్మికులకు 12 నెలలుగా వేతనాలు అందలేదన్నారు. ఇలాగైతే వారు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు నెల నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలని, లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేష్, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి పద్మావతికి వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

బాధితులకు సత్వరమే న్యాయం జరగాలి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల ఇచ్చే బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 70 అర్జీలు స్వీకరించారు. ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, మోసాలు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఆయా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగు వదిలితే చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-రొద్దం

ఇళ్లలోని వృథా నీటిని రోడ్డుపైకి వదిలితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. మండలంలోని కంచి సముద్రం గ్రామంలో రోడ్డుపైకి మురుగునీరు వెళుతుండడంతో సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో 'కంచిసముద్రంలో రోడ్డుపై మురుగు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు సోమవారం గ్రామంలో పర్యటించారు. వృథా నీటిని వదిలేందుకుకు ప్రతి ఇంటి ముందు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, అలాకాకుండా రోడ్డుపైకి మురుగునీరు వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సర్పంచి గంగాధర్, ఉన్నారు.

పారిశుధ్యంలోపై ప్రజలతో మాట్లాడుతున్న పంచాయతీ అధికారులు

ఆలయ కమిటీ ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న గుండుమల

భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి కమిటీ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మండలంలోని భక్తరహళ్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట శ్రీఆంజనేయస్వామి ఆలయాల కమిటీ ఛైర్మన్‌గా సోమవారం నరసేగౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్షినారాయణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురుమూర్తి హాజరై నరసేగౌడ్‌ను అభినందించారు. గుండుమల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నాగరాజు, సర్పంచి రామాంజినేయులు, ఆలయ ఈవో నరసింహరాజు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైరు చోరీ

తలుపుల : స్థానిక బలిజపేట సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 3 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని సుమారు 90 కిలోల కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కాపర్ వైరు దొంగల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కులగణన త్వరగా పూర్తి చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జనగణనలో భాగంగా రాష్ట్రంలో కులగణన ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాల నాయకులు కోరారు. పట్టణం లోని సాయి ఆరామంలో సోమవారం సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జన గణన, కుల గణన చేపడితే జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. జన గణన చేయడం వల్ల ప్రభుత్వం ఆయా కులాల వారికి ఏం చేయాలి ఏవిధంగా అభివృద్ధిలోకి తీసుకురావాలి అనేది తెలుస్తుందన్నారు. బిసి సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ వెనుకబడిన కులాల హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎంపి బికె.పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బిసిల పక్షపాతి అని, జనగణన, కుల గణన చేపట్టాలని సిఎం, పిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ కేంద్రంలో టిడిపి పాత్ర క్రియాశీలకంగా ఉందని కుల గణన చేపట్టి బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కెటి.శ్రీధర్, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర్, చేతివృత్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, బిసి సంగం జిల్లా అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు, నాయకులు గోవింద్, చంద్రమోహన్, జయచంద్ర, లక్ష్మీనరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

మతపిచ్చిని వీడి ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుంటే ఉద్యమిస్తాం : సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ

ప్రజాశక్తి-బత్తలపల్లి

పేదల సంస్థగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్న ఆర్‌డిటి సంస్థకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతపిచ్చిని విడనాడి తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించా లని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం సిపిఐ, ప్రజా సంఘాల నాయకులతో కలిసి స్థానిక ఆర్‌డిటి ఆసుపత్రిని సందర్శించారు. రోగులను పరామర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 56 ఏళ్లుగా వివిధ రంగాల్లో సేవలందించిన ఆర్‌డిటి సంస్థను ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సేవలందిస్తున్న ఆర్‌డిటికి మోడీ ప్రభుత్వం విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రితో చర్చించి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో పాటు మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా మద్దతు తెలిపారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎలను పునరుద్ధరించాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, చేతి వృత్తుదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి, వ్యకాసం జిల్లా కార్యదర్శి కదిరప్ప, జిల్లా గౌరవాధ్యక్షులు కుళ్లాయప్ప, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, ముసుగు మధు, సిపిఐ నాయకులు ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ఎస్‌టియు సన్మానం

పుట్టపర్తి రూరల్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)నుంచి ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించా లని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరతానని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ హామీ ఇచ్చారు. రామకృష్ణను సోమవారం పట్టణంలో ఎస్‌టియు నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు, సర్వీస్ రూల్స్ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రామకృష్ణను కోరారు.

గ్రీవెన్స్‌లో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో 1500 కుటుంబాలు నివసిస్తున్నాయని, తక్షణమే వీధిలైట్లు, తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండలం కన్వీనర్ పైపల్లి గంగాధర్, కాలనీవాసులు రామచంద్ర, మోహన్, శ్రీనివాసులు, పురుషోత్తం, శివరాజ్, శశి కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధించాలి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 56 ఏళ్లుగా పేద ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్న ఆర్‌డిటి సంస్థకు తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ సేవ్ ఆర్‌డిటి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రామ్‌ప్రసాద్, సాకే వినయ్ కుమార్, జగన్మోహన్, మంజుల నరేంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా దళిత భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. పుట్టపర్తి మండలంలోని కప్పలబండ, కొత్తచెరువు మండలంలోని బైరాపురంలో దళిత భూములు కబ్జాకు గురైనట్లు ఆయన ఆర్డీవోకు వివరించారు. ఆయన వెంట వేదిక గౌరవాధ్యక్షుడు బాబు ప్రసాద్, రాజశేఖర్, భాధితులు ఉన్నారు.

భూమి పరిహారం అర్హులకే ఇవ్వాలి

చిలమత్తూరు : మండలంలోని టేకులోడు పంచాయతీలో ఎపిఐఐసి ఆధ్వర్యంలో సేకరిస్తున్న భూములకు సంబంధించి అర్హులైన రైతులకే భూ పరిహారం ఇవ్వాలని వైసిపి మండల కన్వీనర్ ఎస్.రామకృష్ణారెడ్డి కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. కొందరు బినామీల పేర్లపై భూములు పొంది పరిహారం పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. అలాగే వెంటనే రెగ్యులర్ తహశీల్దార్, ఎంపిడిఒ, సబ్ రిజిస్ట్రార్లను నియమించాలని కోరారు.

రహదారుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

రాష్ట్ర వ్యాప్తంగా రహదారులను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, తెలిపారు. స్థానిక ధర్మవరం రోడ్డులో చిన్న కాలువ నుంచి పుట్టపర్తి రోడ్డులోని యూనియన్ బ్యాంకు వరకూ ఒక కిలోమీటర్ మేర పనులు చేపట్టేందుకు రూ. 2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో సోమవారం వారు స్థానిక చిన్నపిల్లల ఆసుపత్రి వద్ద రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు వేశామన్నారు. మండలంలో రూ. 3 కోట్ల నిధులతో రోడ్లు వేశామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నందున రహదారికి ఇరువైపులా ఆక్రమణలను తొలగించి రోడ్డుతో పాటు డ్రెయినేజీ కాలువ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఆక్రమణలను తొలగించి అక్కడ నూతన రోడ్డు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్ఈ సంజీవయ్య, తహశీల్దార్ బాలాంజనేయులు, జేఈ మున్నూరుస్వామి, టిడిపి నాయకులు ఎస్.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శివప్రసాద్, సామకోటి ఆదినారాయణ, ఆర్.నాగేంద్ర, శంకర్, శ్రీనాథ్, రాజు పాల్గొన్నారు.

రహదారి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

రేషన్ పంపిణీలో అక్రమాలకు తావుండదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చెన్నేకొత్తపల్లి

ఇకపై రేషన్ పంపిణీలో అక్రమాలకు ఏమాత్రం తావుండదని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ నూతన స్మార్ట్ రేషన్ కార్డులు అందించే బాధ్యత డీలర్లదే అన్నారు. గతంలో రేషన్ పంపిణీలో అనేక అక్రమాలు జరిగేవని, ఇక నుంచి ఇలాంటి వాటికి తావుండదని స్పష్టం చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో లాగా పార్టీలు చూసే పరిస్థితి ఉండదని తెలిపారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో వెలసిన ఎల్లమ్మ ఆలయం వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట రెవెన్యూ అధికారులు, టిడిపి నాయకులు, రేషన్ డీలర్లు, ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

సిపిఎం నేతకు పరామర్శ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న గుండెకు సంబంధించిన చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు వి.రామిరెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి పెద్దన్నను పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

పెద్దన్నను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

కోటి బాబుని పరామర్శిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కోటి బాబుకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-బత్తలపల్లి

కురుబ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబును సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శించారు. కోటి బాబు అనారోగ్యంతో 2 నెలలుగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో మంత్రి బత్తలపల్లిలోని కోటి బాబు నివాసానికి వెళ్లి పరామర్శించారు. కోటి బాబు ఆరోగ్యం గురించి ఆయన సతీమణి జడ్పిటిసి కోటి సుధను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, ఆకులేటి వీరనారప్ప, తదితరులు ఉన్నారు.

కరాటే పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారికి మాస్టర్ షాకీర్ బెల్ట్, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. మాస్టర్ షాకీర్ కరాటే వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కరాటే సాధన వల్ల ఆత్మరక్షణ, విశ్వాసం, ధైర్యం, శారీరక దృఢత్వం, మానసికోల్లాసం, మేధాశక్తి పెంపొందుతాయని తెలిపారు. చదువుతో పాటు కరాటే కూడా చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో కరాటే కోచ్ చాందిని, కరాటే సీనియర్స్ బ్లాక్ బెల్ట్ విద్యార్థులు అలిహివసల్లం, మహమ్మద్ కైఫ్, రీదాముస్కాన్, రోషిని, రబ్బున్, రెహాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-లేపాక్షి

జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తలకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్‌పి.శ్రీనివాసులు, జిల్లా నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ అధ్యక్షతన సోమవారం స్థానిక నంది పార్కులో సిఐటియు కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జడ్‌పి.శ్రీనివాసులు మాట్లాడుతూ పని వేళలు 12 గంటలకు పెంచడం అంటే శ్రామికుల శ్రమను దోపిడీ చేయడమే అన్నారు. ఈ నెలలో జరిగే సిఐటియు మహాసభలు, సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే రాష్ట్రం తీవ్రంగా నష్ట పోతుందన్నారు. వైద్యం ప్రజల ప్రాథమిక హక్కు అని, దానిని అమలు చేయాల్సిన భాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి క్రిష్ణమూర్తి, అంగన్వాడీ కార్యకర్తలు ధనమ్మ, శివమ్మ, మాధవి, జయసుధ, ఆశా వర్కర్లు రాధమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు, ఆశా, అంగన్వాడీలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

త్వరలోనే చెరువులకు నీరిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

హంద్రీనీవా కాలువల ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులను త్వరలోనే నీటితో నింపుతా మని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. 2004-09 మధ్య హౌసింగ్‌లో జరిగిన అక్రమా లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైసిపి అధినేత జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి ఎందుకు రాలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో సోమవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ఆనాటి పాలకులు, హౌసింగ్ అధికారులు ప్రభుత్వ హౌసింగ్ పథకంలో అక్రమాలకు పాల్పడి పేదలకు అన్యాయం చేశారన్నారు. వాటిపై త్వరలోనే విచారణ జరిపి పేదలకు న్యాయం చేస్తామన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా ధనియాన్‌చెరువుకు నీరిస్తామన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అదనంగా రూ. 7 కోట్లు మంజూరు చేయిస్తామన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. వైసిపి అధితనే జగన్‌కు రాజకీల్లో ఉండడానికి అర్హత లేదన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డు ఇస్తాం

కదిరి టౌన్ : అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ భరోసా ఇచ్చారు. పట్టణంలోని సైదాపురంలో చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అర్హులైన పేదలు సచివాలయం వెళ్లి ఒక తెల్లటి కాగితం మీద రాసి ఇస్తే కూడా రేషన్ కార్డు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వివిఎస్.శర్మ, తహశీల్దార్ మురళీకృష్ణ, మున్సి పల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ పర్వీన్‌బాను, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, జనసేన ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, నాయకులు నాగప్ప, కేశవరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్‌లను సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పుట్టపర్తిలో వారి వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా వారికి పూలబొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కదిరి నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు, శాంతి భద్రతల గురించి వారి దృష్టికి తీసుకెళ్లారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన ర్యాలీ చేపట్టిన అధికారులు

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-అమడగూరు

నిత్యావసర వస్తువులపై ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టిపై సోమవారం అమడగూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులకు వస్తువులపై తగ్గిన జిఎస్‌టి కరపత్రాలు పంపిణీ చేశారు. జిఎస్‌టి గురించి దుకాణ యజమానులు, వినియోగదారులకు అవగాహన కల్పించినట్లు ఎంపిడిఒ మునెప్ప తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ వస్తువులను తగ్గిన జిఎస్‌టి ప్రకారం విక్రయించాలన్నారు. జిఎస్‌టి తగ్గిన వస్తువులను ఎక్కువ ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకు దుకాణాల్లో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులనే విక్రయించాల న్నారు. అలాగే కిరాణా షాపుల వద్ద నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కల్పించారు. జిఎస్‌టి తగ్గుదలతో నిత్యావసర సరుకులన్నీ తక్కువ ధరకే అందుతాయన్నారు. దాదాపుగా అన్ని నిత్యావసర వస్తువులపై రేట్లు తగ్గాయని, అధిక ధరకు విక్ర యిస్తే దుకాణాదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాజశేఖర్, ఎపిఒ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మమత, వెలుగు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి

రొద్దం : ఆటోలో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి మహిళా కూలీ అదే ఆటో చక్రాల కింద పడి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన మహిళా కూలీలు రోజూ ఆటోల్లో చుట్టు పక్కల గ్రామాల్లో రైతుల పొలాల్లోని వ్యవసాయ పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో సోమవారం తాడంగిపల్లి గ్రామంలో ఓ రైతు పొలంలో వ్యవసాయ పనులు ముగించుకుని కూలీలు ఆటోలో తిరుగు పయనమయ్యారు. మధ్యాహ్నం 3 గంటల సమయం లో ఆటో పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిపై వెళ్తుండగా గ్రామ సమీపంలో సుబ్బరాయప్పగారి కొట్టాల వద్ద మహిళా కూలీ నందిని అదుపుతప్పి అదే ఆటో చక్రాల కింద పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నందిని ని అదే ఆటోలో రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా నిత్యం ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ కూలీల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు పలువురు వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు, కూలీలను తరలించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదంలో మృతి చెందిన కూలీ నందిని

గోడ కూలి వ్యక్తి..

అమడగూరు : ప్రమాదవశాత్తూ గోడ కూలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మంజుల వెంకటరమణ పాత భవనంలో కూలి పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ రాతి దూలం మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన ప్రైవేటు వాహనంలో కదిరి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కు అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

వెంకటరమణ(ఫైల్‌ఫొటో)

అదుపుతప్పిన కారు.. వ్యాపారికి తప్పిన ప్రమాదం

ముదిగుబ్బ : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ముదిగుబ్బ వద్ద సోమవారం ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో మదనపల్లికి చెందిన పట్టుచీరల వ్యాపారికి తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. మదనపల్లి పట్టణానికి చెందిన పట్టుచీరల వ్యాపారి శివానంద వ్యాపార నిమిత్తం కారులో ధర్మవరం బయల్దేరారు. ముదిగుబ్బ సమీపంలోని బిఎస్‌ఎన్‌ఎల్ ఎక్స్ఛేంజి మలుపు సమీపంలో వెళ్తుండగా ఉన్నఫళంగా కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న శివానందకు తృటిలో ప్రమాదం తప్పి క్షేమంగా బయటపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

వైద్యవిద్యను కాపాడాలి

అభివాదం తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- హిందూపురం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిలుపుదల చేసి వైద్య విద్యను పరిరక్షించాలని ఐక్య రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. వైద్య విద్యను పరిరక్షించాలని కోరుతూ సోమవారం ఎస్ యు సి ఐ పార్టీ కార్యాలయంలో ఆర్ఎస్పీ కార్యదర్శి ఎ. శ్రీనివాసులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అనే అంశంపై పెద్ద దుమారం చెలరేగుతోందని తెలిపారు. గత నాలుగు సంవత్సరాల క్రితం ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మెడికల్ కళాశాల ఉండాలనే నిబంధనతో కేంద్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను రాష్ట్రంలో ఉన్న కళాశాలలకు అనుగుణంగా 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కరోనా అనంతరం కళాశాలల నిర్మాణం చేపట్టడంతో ప్రస్తుతం ఐదు మెడికల్ కాలేజీలు పూర్తయిన మరో రెండు పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. సగం నిర్మాణంతో మరోపది మెడికల్ కళాశాలల ఉన్నాయని, వీటిని ప్రైవేటీకరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం పూనుకొంటోందని, ఇది చాలా దుర్మార్గమైన చర్యని విమర్శించారు. వైద్యం పూర్తిగా వ్యాపారీకరణ జరిగితే వైద్యం సామాన్య ప్రజలకు అందని ద్రాక్ష పండులా వైద్యం మారే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఉద్యమంలో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యామ్ కిరణ్, ఎస్.యు.సి.ఐ నాయకులు బసవరాజు, గిరీష్, అశోక్, జలసాధన సమితి కార్యదర్శి గంగిరెడ్డి, ఎంఐఎం పార్టీ నాయకులు మున్నా, దళిత సమైక్య అధ్యక్షులు ఎస్.నారాయణ, ఊటుకూరు నరసింహమూర్తి, జై భారత్ భీమ్ రావు పార్టీ నాయకులు ఊటుకూరు నాగరాజు, ఏపీ ఆర్ ఎస్ పార్టీ నుండి కోడుమూరు నౌషాద్, ఎమ్మెస్ ఎఫ్ నాయకులు రవికుమార్, నాయి బ్రాహ్మణ సంఘం నరసింహమూర్తి, ఎస్ యు సి ఐ నుండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యువతి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మారుతినగర్‌లో నివసిస్తున్న పెయింటర్ అల్తాఫ్‌బాషా, ఫర్జానాభాను దంపతుల కుమార్తె 20 ఏళ్ల షేక్ షబీనా కాలేయం(లివర్) సమస్యతో బాధపడుతోంది. ఆమె బెంగళూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఆమె వైద్యానికి రూ. 20 లక్షల వరకూ ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మదీనా మసీదు కమిటీ ముతవల్లి నాగూర్ హుస్సేన్ , కమిటీ సభ్యులు సోమవారం వారి ఇంటికి వెళ్లి షేక్ షబీనాను పరామర్శించారు. మసీదులో చందా రూపంలో పోగు చేసిన రూ. 41,600లను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాగూర్ హుస్సేన్, అల్తాఫ్, టి.అయూబ్‌ఖాన్, సలీం ఖాన్, సయ్యద్ ఈనాయతుల్లా, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించడం అభినందనీయం

సిఐను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- హిందూపురం

యువతను ప్రోత్సహించేందుకు సెలవు రోజుల్లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం, విశ్రాంత ఎస్ఐ లోకేష్ పేర్కొన్నారు. హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో వైసిపి యువ నాయకులు మనోజ్ జూలియట్ (మింటూ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో వారు మాట్లాడుతూ నేటి యువత విద్య పట్ల నిర్లక్ష్యం చేస్తూ సెల్ ఫోన్స్, సామాజిక మధ్యమాలకు బానిసలవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని నామమాత్రంగా కాకుండా పాఠశాల ఉన్నత విద్య దశలోనే పిల్లలకు నిర్భంధ క్రీడలను అమలు చేయాలని, వ్యక్తిత్వ వికాసం తరగతులు ప్రవేశపెట్టి యువత, విద్యార్థి దశలోనే శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఔత్సాహిక క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడం కోసం హిందూపురం పట్టణంలో మింటూ పలుమార్లు క్రీడా పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. విజేతలకు సిఐ తదితరులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు చిన్న కొండప్ప, వెంకటేష్, బ్రహ్మయ్య, మహేష్, రామాంజినేయులు, నరసింహమూర్తి, శివ, దాదా ఖలందర్, రైల్వే పోలీస్ శీన, సిరాజ్, ఉమర్ ఫరూక్, శ్రీరాములు, శాంతరాజు, శ్యామ్ బాబు, లోహిత్, కుట్టి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమి కేటాయించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలో వాల్మీకి కళ్యాణ మండపం, కమ్యూనిటీ భవనం, వాల్మీకి సీతారామ దేవాలయానికి భూమి కేటాయించాలని కోరుతూ సోమవారం వాల్మీకి బోయ కులస్తులు పెనుకొండలో మంత్రి సవితకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 5వేల వాల్మీకి, బోయ కుటుంబాలు ఉన్నాయన్నారు. కావున కళ్యాణ మండపం, కమ్యూనిటీ భవనం, సీతారాముల ఆలయం నిర్మాణానికి సోమందేపల్లిలో ఒక ఎకరా స్థలం కేటాయించాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాలని మంత్రిని కోరారు. వినతి ఇచ్చిన వారిలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, నగర కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, నాయకులు నీరు గంటి చంద్రశేఖర్, వెంకటేష్, హనుమంతు, శ్రీనివాసులు, వెంకటేష్, చలపతి, తదితరులు ఉన్నారు.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి

ఉప్పరపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

లేపాక్షి : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తహశీల్దార్ సౌజన్యలక్ష్మి హాజరై మాట్లా డారు. పౌరుల హక్కులను కాపాడటమే ప్రభుత్వం బాధ్యత అన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హక్కులు ప్రతి పౌరుడికీ ఒకేలా ఉంటాయన్నారు. సమాజంలో అందరికీ సమాన హక్కులు ఉంటాయని, వాటిపై అవగాహన పెంపొందించుకో వాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహమూర్తి, రూరల్ సిఐ జనార్ధన్, ఆర్ఐ ప్రమీలమ్మ, గ్రామ పంచాయతీ అధికారి రమేష్‌బాబు, ప్రజలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో తహశీల్దార్ నారాయణస్వామి, వ్యవసాయ అధికారి రవీంద్ర, ఎపిఎం హేమలత, కానిస్టేబుల్ షౌకత్ పాల్గొన్నారు. అయితే పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు పట్టాదారు పాసు పుస్తకాలు, రస్తా, వ్యవసాయ పొలాల గట్టు వివాదాలు, తదితర సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

865 మందికి అన్నదానం

ప్రజాశక్తి- హిందూపురం

సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం 865 మందికి అన్నదానం నిర్వహించారు. 391 వ రోజు నిత్య అన్నసంతర్పణలో భాగంగా సేవాకర్తలు జయకుమార్, లక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, అలాగే ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి రమేష్ కుమార్తె దేవీ శ్రీ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధి రవిశంకర్, గొల్లన్న తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- హిందూపురం

మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని బోయపేట, ఇందిరా నగర్ వార్డుల్లో కౌన్సిలర్ సతీష్ కుమార్ అధ్యక్షతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. . ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల్లో క్యూ ఆర్ కోడ్ ఉండటం వల్ల ఎటువంటి మోసాలు చేసే అవకాశం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివ, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత

ప్రజాశక్తి-లేపాక్షి

శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం స్థానిక దుర్గా వీరభద్ర పాపనేశ్వరస్వామి ఆలయంలో దుర్గామాత సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమా నందన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలా నక్షత్రం కావడంతో అర్చక బృందం అమ్మ వారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. మహా మంగళహారతి ఇచ్చారు. ఆలయంలో స్వయంభువుగా వెలసిన వీరభద్రస్వామికి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఛైర్మన్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్ను లు, పెన్సిళ్లు అందజేశారు. భక్తులకు మాజీ ఎంపిపి ఆనంద్ కుమార్ అన్నప్రసాదం అందజేశారు. ఈవో నరసింహమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రత్యేక పూజల్లో హిందూపురం డీఎస్పీ మహేష్, రూరల్ సిఐ జనార్దన్, తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ జయప్ప, టిడిపి మండల కన్వీనర్ అఖిలాష్, జనసేన మండల అధ్యక్షుడు బాలాజీ, నరసింహమూర్తి, రామాంజనమ్మ పాల్గొన్నారు.

బత్తలపల్లి : దసరా మహోత్సవాల్లో భాగంగా 8వ రోజైన సోమవారం దుర్గామాత సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని ఆలయం, ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారి పక్కన కొలువుదీరిన దుర్గామాత, అనంతసాగరంలో కొల్లాపురమ్మ, రామాపురంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు మంజునాథశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మండలంలో అమ్మవారి ఆలయాలు విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్నాయి. కార్యక్రమంలో దుర్గామాత కమిటీ సభ్యులు జక్కంపూడి వెంకటేశ్వరచౌదరి, జొన్నగడ్డల రంగానాయుడు, జాంపుల భాస్కర్, చల్లా ఓబులనాయుడు, జాస్తి చిట్టి, వినయ్, ముళ్లగూరు

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగించే చర్యలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ నారాయణరెడ్డి హెచ్చరించారు. కుటాగుళ్ల గ్రామానికి చెందిన విజయ్ కుమార్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ సర్కిల్‌లో అనుమతులు లేకుండా బాణసంచా పేల్చడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి తహశీల్దార్ మురళీకృష్ణ వద్ద బైండోవర్ చేసినట్లు సిఐ తెలిపారు. ఎటువంటి కార్యక్రమాలకైనా పోలీసులతో ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎవరికి వారే చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

గ్రామ కంఠం స్థలంపై వివాదం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని గౌరాజుపల్లి గ్రామ రైతు సేవా కేంద్రం వద్ద ఉన్న గ్రామ కంఠం స్థలం 30 సెంట్ల విషయంలో సోమవారం వివాదం నెలకొంది. ఈ స్థలాన్ని మూడు భాగాలు చేయగా వాల్మీకులు వాల్మీకి విగ్రహం, దళితులు అంబేద్కర్ విగ్రహం, రజకులు దోబీఘాట్ ఏర్పాటు చేసుకునేలా గ్రామ పెద్దలు, ఎం.కొత్తపల్లి సర్పంచి నాగరాజు తెలిపారు. సోమవారం వాల్మీకులు, దళితులు వారికి కేటాయించిన స్థలాల్లో బండలు నాటి వారి నాయకుల చిత్రాలు ఏర్పాటు చేశారు. ఇంతలో రజకులు అక్కడికి చేరుకోవడంతో మాటామాటా పెరిగి గొడవ పడ్డారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ నరేంద్ర అక్కడికి చేరుకొని ఏదైనా సమస్య ఉంటే తహశీల్దార్ వద్ద పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో వాల్మీకులు, దళితులు తహశీల్దార్ కార్యాలయం వెళ్లి సమస్యను తెలిపారు. రజకులు పెనుకొండ వెళ్లి మంత్రి సవితకు సమస్యను వివరించారు. విషయం తెలుసుకొన్న మిగతా రెండు వర్గాల ప్రజలు మంత్రి వద్దకు వెళ్లి చర్చించారు. ఆ స్థలంలోకి ప్రస్తుతం ఎవరూ వెళ్లకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.